సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 28 । జూన్ । 2024



జేబులో ఫోన్ ఉంటే చాలు

జేబులో ఓ స్మార్ట్ ఫోన్, ఖాతాలో డబ్బు ఉంటే చాలు. లావాదేవీని సులభంగా చేయొచ్చు డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. -8లో



నాలుగు దుంగలు, కారు స్వాధీనం

బద్వేలు ఫారెస్టు రేంజ్ పరిధిలోని లోతువంక బీటులోని రాణిబావి అటవీ ప్రాంతంలో 4 ఎర్రచందనం దుంగలను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.9/23.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 23.4 - 33.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 29 (శనివారం) జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

నేడు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ రాక

కడప సెవెన్‌రోడ్స్: ఐదో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ శుక్రవారం కడపకు వస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఈ సందర్భంగా సమావేశం ఉంటుందన్నారు. ఫైనాన్స్ కమిషన్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి, మెంబర్ సెక్రటరీ డాక్టర్ కేవీ రమణారెడ్డి ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. గ్రామ, మండల జిల్లా పరిషత్ సమస్యలు, పన్నులు, వ్యయాలు, ప్రాథమిక అవసరాలు, కేంద్ర, రాష్ట్ర స్కీములపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓతో పాటు జిల్లాకు చెందిన డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఓఈపీఆర్ అండ్ ఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొని వివిధ సమస్యలపై చర్చిస్తారని వివరించారు.

రైళ్ల గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా మీదుగా నడుస్తున్న అహ్మదాబాద్-తిరుచునాపల్లి (09419/09420), మధురై-ఓకా-మధురై (09519/09520) రైళ్ల గడువును పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు.అహ్మదాబాద్ నుంచి తిరుచునాపల్లికి వెళ్లే రైళ్ల గడువు ఈనెల 27వ తేదిన ముగియనుండగా, దానిని సెప్టెంబరు 26వ తేది వరకు, తిరుచునాపల్లి నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే ప్రత్యేక రైలు గడువు ఈనెల 30న ముగియనుండగా, ఆ రైలును సెప్టెంబరు 29వ తేది వరకు పొడిగించారన్నారు. ఓకా-మధురై మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువు ఈనెల 24తో ముగిసిందని, దానిని సెప్టెంబరు 30వ తేది వరకు పొడిగించారన్నారు. మధురై-ఓకా మధ్య నడిచే ప్రత్యేక రైలు గడువు ఈనెల 28వ తేదిన ముగియనుందని, దీనిని అక్టోబరు 4 వరకు పొడిగించారన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

సంపూర్ణత అభియాన్‌కు ప్రణాళిక

కడప సెవెన్‌రోడ్స్: సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని జులై 4 నుంచి సెప్టెంబరు వరకు నిర్వహిస్తున్నామని నీతి అయోగ్ సీఈఓ సుబ్రమణ్యం తెలిపారు. ఆకాంక్షిత బ్లాక్ ప్రోగామ్ కింద ఎంపికై న జిల్లా కలెక్టర్లతో గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్‌కు సంబంధించి మూడు నెలల కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఆరు ముఖ్యమైన ఇండికేటర్స్‌ను ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగామ్ కింద జిల్లాలో ఎంపికైన జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె మండలాల్లో సాచ్యురేషన్ స్థాయికి తీసుకు వెళ్లాలన్నారు. గర్భిణుల సమస్యలు, బాలింతల పోషకాహార సమస్యలు, విద్యలో మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయంలో సాయిల్ హెల్త్ కార్డులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు బ్యాంకు రుణాలు వంటివి ఇండికేటర్స్‌గా ఎంపిక చేశారన్నారు.

కేవీకేను వరించిన పురస్కారాలు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి(కేవీకే) మూడు పురస్కారాలు లభించాయి. రాజమండ్రి వేదికగా జరుగుతున్న జోనల్ స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో బుధవారం అవార్డులను కేవీకే పోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్యకు అందచేశారు. ఇందులో భాగంగా గ్రామీణ యువతను వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత రంగాలవైపు ఆకర్షించే పథకాన్ని విజయవంతంగా నడిపిస్తున్నందుకు, మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను జిల్లాలో విస్తరించినందుకు, స్పాన్సర్డ్ శిక్షణా కార్యక్రమాలను ఎక్కువగా జరపడం వంటి మూడు విభాగాలకు సంబంధించి పురస్కారాలు లభించాయి. వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అనుప్రయోగ సంస్థ(అటారీ) జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్.ఎన్. మీర, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. ప్రమీలరాణి, భారత నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథుర్‌ల చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ అవార్డులను రావడానికి సహకరించిన కేవీకే సిబ్బందికి, రైతులకు, వ్యవసాయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక తోడేళ్లు

- పెన్నానదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పోటాపోటీగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎంపీ రమేష్‌ల అనుచరులు
- ప్రొద్దుటూరు మండలం రేగులపల్లి గ్రామంలో అక్రమ మైనింగ్
- పొట్లదుర్తి మీదుగా ఇతర ప్రాంతాలకు తరలింపు
- పాపాఘ్నిని చెరబట్టిన తెలుగుతమ్ముళ్లు
- వేంపల్లెలో రెండు వర్గాలు పోటాపోటీగా అక్రమ రవాణా
- కొత్తూరు, తుమ్మలూరు, మాచునూరు, పైడికాల్వ, పొడదుర్తి నుంచి నిత్యం దోపిడీ





ప్రొద్దుటూరు మండలం రేగులపల్లెలోని పెన్నానదిలో పొక్లెయిన్‌తో ఇసుక కోసం తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, కడప: కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఇసుక పాలసీపైన స్పష్టత లేదు. ఈలోపు దొరికిన కాడికి దోచుకోవాలనే తలంపు తెలుగుతమ్ముళ్లల్లో మెదిలింది.అంతే, ఆలస్యం చేయకుండా ఎవరిస్థాయిలో వారు ట్రాక్టర్ మొదలు పొక్లెయిన్లతో లోడింగ్ చేస్తూ టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నదులను గుల్ల చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం తెలుగుతమ్ముళ్లు పోటీ పడుతున్నారు. పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్న వైనం వారం రోజులుగా ఊపందుకుంది.

ఉమ్మడి కడప జిల్లాలో మైనింగ్ స్మగ్లింగ్ ఊపందుకుంది. ఆయా నియోజకవర్గాల్లో అనుచరులు పోటాపోటీగా ఇసుక తరలిస్తున్నారు. ఎంపీ రమేష్‌నాయుడు అనుచరులు మొదలు పెడితే, ఆ పక్కనే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు ఆరంభించారు. వేంపల్లె కేంద్రంగా టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి వర్గీయులు ప్రారంభిస్తే, వెనువెంటనే ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గీయులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే చైతన్యరెడ్డి వర్గీయులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ ప్రభుత్వ నిర్ణయం వెలువడక ముందే అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

తిరగబడ్డ హనుమాన్‌గుత్తి గ్రామస్తులు..

ప్రొద్దుటూరు మండలం రేగులపల్లి గ్రామ పరిధిలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను హనుమాన్‌గుత్తి, పొట్లదుర్తి మీదుగా వివిధ పట్టణాలు, సిటీలకు తరలిస్తున్నారు. తొలుత ఎంపీ రమేష్‌నాయుడు వర్గీయులు ఆరంభించగా, వెంటనే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు రంగప్రవేశం చేశారు. పోటాపోటీగా అక్రమ రవాణా వ్యవహారాన్ని గమనించిన ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అడ్డుకున్నారు. భవిష్యత్‌లో తాగునీరు కూడా కష్టమేనని ఆవేదన చెందుతూ టిప్పర్లతో తరలిస్తుండగా అడ్డుపడ్డారు. పాపాఘ్ని నదిలో వేంపల్లె కేంద్రంగా పొరుగు గ్రామానికి చెందిన ఓ నాయకుడు పొక్లెయిన్ పెట్టి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే, మరుసటి రోజు వేంపల్లెకు చెందిన నాయకులు మరో పొక్లెయిన్ పెట్టి టిప్పర్లతో ఇసుక తరలించడం ఆరంభించారు. కొత్తూరు, నందిమండలం, తుమ్మలూరు, మాచునూరు, పైడికాల్వ, పొడదుర్తి ఇలా గ్రామగ్రామాన పాపాఘ్ని నది నుంచి ఇసుక కొల్లగొడుతున్నారు. పొడదుర్తి నుంచి పగలంతా వెంకటాపురం సమీపంలోని చెన్నకేశవస్వామి వెనుక వైపు డంపింగ్ చేయడం అక్కడి నుంచి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇదే విషయమై స్థానికులు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులకు ఎవ్వరికి ఫిర్యాదు చేసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు వాపోతున్నారు.



పొక్లెయిన్లతో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



గ్రామస్తులు అడ్డుకున్న వాహనాలు

రహదారి వేసి మరీ అక్రమ రవాణా...

నదుల్లోకి టిప్పర్లు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేసి మరీ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ప్రభుత్వానికి పైసా రాయల్టీ చెల్లించకుండా ప్రకృతి సంపదను దోపిడీ చేస్తున్నారు. గ్రామస్తులు ప్రత్యక్షంగా ఆందోళన చేస్తే అధికారులు మమ అనిపిస్తూ అటువైపు పర్యటనకు మొగ్గుచూపుతున్నారు. రేగులపల్లి నుంచి ఇసుక పదుల సంఖ్యలో టిప్పర్లతో తరలిస్తున్న వైనంపై హనుమాన్‌గుత్తి గ్రామస్తులు ప్రత్యక్ష ఆందోళన చేస్తే రెవెన్యూ యంత్రాంగం గురువారం వెళ్లి నదిలో నిర్మించిన రహదారిని మాత్రమే చెరిపేయగలిగారు. అందుబాటులో ఉన్న పొక్లెయిన్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసిన పాపాన పోలేదని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ నూతన పాలసీ వచ్చే వరకు ఇసుకను కాపాడకపోతే, సత్వరమే తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా అధికార యంత్రంగాం నిద్రమత్తు వీడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ఇసుక తరలించేందుకు నది మధ్యలో వేసిన రహదారి

ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆచార్యులు

వైవీయూ: ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్)లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈనెల 24 నుంచి ఫైన్‌ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ, మ్యాథమ్యాటిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఆచార్యులు విచ్చేసి ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. చివరిరోజు గురువారం సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత, సహ ఆచార్యులు డా. వి. లాజర్, తిరుపతి ఎస్వీయూ సైకాలజీ ఆచార్యులు ఎస్. విశ్వనాథరెడ్డి, మైసూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. సంపత్ కుమార్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ గణేష్‌కుమార్



జేసీ గణేష్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న సుభాషిణి, రాజామణి

కడప అగ్రికల్చర్: జిల్లా సహకారం కేంద్ర బ్యాంకు(డీసీసీబి), జిల్లా సహకార మార్కెటింగ్‌శాఖ(డీసీఎంఎస్)లకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన బుధవారం డీసీఓ సుభాషిణి, డీసీసీబీ ఇన్‌చార్జి సీఈఓ రాజామణిల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ డీసీసీబీ, డీసీఎంఎస్‌ల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయనకు డీసీఓ, డీసీసీబీ ఇన్‌చార్జి అభినందనలు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి పక్కాగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పథక పంపిణీ పై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ...పెన్షన్ డిస్బర్సుమెంట్ గైడ్ లైన్స్ ప్రకారం పెంచిన పింఛన్లను జులై 1 వ తేదీన వలంటీర్ల వ్యవస్థతో కాకుండా సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే అందజేయాలని ఆదేశించారు. ఏవైనా మిగిలిపోయిన పెన్షన్లు ఉంటే జూలై 2 వ తేదీలోపు ఎట్టి పరిస్థితుల్లో అందజేయాలన్నారు. సచివాలయ ఎంప్లాయ్ లాగిన్‌లో 50 మందితో క్లస్టర్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు డిప్యూటేషన్‌లో ఉన్నా, సిబ్బంది తక్కువగా ఉన్న చోట్ల ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవచ్చునని, వీళ్లకి లాగిన్స్ మండల ప్రజా పరిషత్ లాగిన్ లో ఉంటాయని తెలిపారు.జూలై 29న పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ అమౌంట్ విత్ డ్రా చేసి సంబంధిత సిబ్బందికి అందించాలని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో పెన్షన్ సొమ్ము రూ. 4000 కి పెంచడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత మూడునెలలకు 3000తో కలిపి మొత్తం రూ. 7000 రూపాయలు పెన్షన్ దారులకు పంపిణీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పెన్షనర్ల క్లస్టర్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.సచివాలయాల పరిధిలో సిబ్బంది కొరతగా ఉన్నచోట్ల ఇతర ప్రభుత్వ అధికారులను నియమించుకొని పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఆనంద్ నాయక్, సీపీఓ వెంకటరావు, అనుడా విసి నందన్, ఎల్ డి ఏం జనార్దన్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి జి వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సహకారంలో అనిశ్చితి

- రాజీనామా చేసిన పాలక వర్గాలు
- ముందుకుసాగని పాలనా వ్యవహారాలు
- పంటరుణాల మంజూరులో సందిగ్ధత
- రూ.200 కోట్లకు పైగా ఆగిన వ్యవసాయ పంట రుణాల రెన్యువల్



కడపజిల్లా సహకార కేంద్ర బ్యాంకు

కడప అగ్రికల్చర్: సహకార రంగంలో అనిశ్చితి నెలకొంది ఈ నెల 12వ తేదీన టీడీపీ సర్కార్ కొలువు దీరింది. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారంతా రాజీనామా చేయాలని కొత్త ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో డీసీసీబీ, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లలో నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్లు, సభ్యులు తమ పదవులకు రాజీనామాలను సమర్పించారు. తర్వాత పాలనా వ్యవహారాల కోసం అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాల్సి ఉంది. ఇందులో డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తారు. అలాగే పీఏసీఎస్‌లకు సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌స్థాయి అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తారు. కానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరిన 15 రోజులు తరువాత బుధవారం (27వ తేదీ) కడప డీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌కు మాత్రం జాయింట్ కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జుగా నియమించారు. మిగతా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)కు మాత్రం ఇన్‌చార్జిలను నియమించలేదు. దీంతో పీఏసీఎస్‌లలో పరిపాలన వ్యవహారాలు స్తంభించిపోయాయి. గతంలో పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన వేంటనే అఫిషియల్ పర్సన్స్‌కు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించేవారు. దీంతో పాలనా వ్యవహారాలు సాఫీగా జరిగేవి. ఇప్పుడు పాలక వర్గాలు లేకపోవడం, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియామకం ఆలస్యం కావడంతో డీసీఈబీ, డీసీఎంఎస్, పీఏసీఎల్‌లలో కొంత అనిశ్చితి నెలకుంది.


పంట రుణాల కోసం ఎదురు చూపులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 77 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు) ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు లక్ష మంది దాకా వ్యవసాయ రైతులు ఉన్నారు. వీరంతా ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగు కోసం రుణాలను తీసుకుంటారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. గత ప్రభుత్వం రైతులకు కావాల్సిన విత్తనాలను సబ్సిడీతో అందజేసింది. ఎరువులను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచింది. దీంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులను చేపట్టారు.ఈ తరుణంలో పంటలసాగుకు అవసరమైన రుణాల కోసం పీఏసీఎస్‌ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అక్కడ పనిచేసే సిబ్బంది రేపురా.. మాపు రా అంటూ కాలయాపన చేస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. బయట వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునే ఆర్థిక స్థోమత లేని వారు పంటల రుణాల మంజూరు ఆలస్యం అవుతుందోమోనని ఆందోళన చెందుతున్నారు.

రూ.200 కోట్లకు పైగా ఆగిన రెన్యువల్స్...

జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘాల(పీఏసీఎస్) పరిధిలో తీసుకున్న రుణాలకు 30 నుంచి 40 వేల మంది రైతులకు సంబంధించిన రూ. 200 కోట్లకుపైగా జూన్ నెలలో రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే పీఏసీఎస్‌లలో శాఖకు సంబంధించిన అఫిషియల్ అధికారులను నియమించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే పీఏసీఎస్‌లలో తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే 7 శాతం వడ్డీ మాత్రమే పడుతుందని,ఆలస్యమైతే 13శాతం అధికవడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. పంట రుణాలను సకాలంలో(ఇన్‌టైమం) చెల్లించపోవడంతో మొండి బకాయిల కింద పడి ప్రభుత్వం నుంచి రాయితీలు రావని వాపోతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పీఏసీఎస్‌లలో సకాలంలో బకాయిలు చెల్లిస్తూ రుణాలను తీసుకుంటున్న వారికి కూడా అధికారుల తప్పిదం వల్ల మొండి బకాయి రైతులుగా గుర్తింపు వచ్చే అవకాశం ఉండటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిస్ట్రిక్ కోఆపరేటివ్ ఆఫీసర్(డీసీఓ) సుభాషిణితో మాట్లాడగా కమిషనర్ కార్యాలయానికి నివేదికలను పంపామని రెండు రోజుల్లో పీఏసీఎస్‌లకు అధికారులను కేటాయిస్తారని తెలిపారు.

గండికోట జలాశయంలో చేపల వేట నిషేధం



కొండాపురం: గండికోట జలాశయంలో జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేట నిషేధించినట్లు కడప ఉప మత్స్య సంచాలకులు కె. శాంతి గురువారం తెలిపారు. చేపలు వృద్ధి చెందేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మత్స్యకారులు చేపల వేటకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమాన విధిస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్య అభివద్ధి అధికారి కిరణ్‌కుమార్, వీఎస్ఏ మల్లేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టరు బోల్తాపడి వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

అట్లూరు : మండలంలోని కడప–బద్వేల్ ప్రధాన రహదారిపై నబీ ఆబాద్ గ్రామం సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు బుధవారం రాత్రి బద్వేల్ నుంచి కడప వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను నబీ ఆబాద్ సమీపంలో బద్వేల్‌కు వెళ్తున్న ఆటో ఢీకొని బోల్తాపడింది. గాయపడిన మహేష్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వచ్చి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

షూటింగ్‌లో ప్రతిభ



ప్రొద్దుటూరు క్రైం : హైదరాబాద్‌లోని గజ్జిబౌలి సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న 24వ ఏపీ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలో ప్రొద్దుటూరులోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ ముబైద్ ప్రతిభ చూపారు. షూటింగ్ పోటీల ఓపెన్ సైట్ కేటగిరీ, సబ్యూట్ మెన్, యూత్ మెన్, జూనియర్ మెన్ కేటగిరీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించారు. బాలుడిని పలువురు అభినందించారు.

జేబులో ఫోన్ ఉంటే చాలు

- ఎక్కడ చూసినా స్మార్ట్‌గా పేమెంట్..
- డిజిటల్ లావాదేవీలలో ముందంజ
- కొవిడ్ అనంతరం చెల్లింపుల్లోనూ మార్పు
- ఏ వస్తువు కొన్నా సెల్‌ఫోన్‌తో చెల్లింపులు
- చిరు వ్యాపారుల వద్దకు డిజిటల్ పేమెంట్



గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో డబ్బు పెట్టుకుని వచ్చే వాళ్లం. బయట పనులపై తిరగడానికి ఎంత అవసరం అంచనా వేసుకుని తీసుకువచ్చేవాళ్లం. కానీ ఇప్పుడు డబ్బు అవసరం లేదు. ఉదయం లేచింది మొదలు బయటికి వెళ్లి వేడివేడి టీ తాగాలన్నా, మార్కెట్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేయాలన్నా, ఇతర ఏ వస్తువులు కొనుగోలు చేయాలన్న చేతిలో నగదు అవసరం లేదు. జేబులో ఓ స్మార్ట్ ఫోన్, ఖాతాలో డబ్బు ఉంటే చాలు.. ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. కావాల్సిన వస్తువు కొనాలన్నా, నచ్చిన ఫుడ్ తినాలన్నా, ఎవరికైనా డబ్బు పంపాలన్నా అన్నీ.. చిటికెలో చేసేయొచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన ఈ డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. పేటీఎం, ఫోన్‌పే క్యూ ఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారి కనిపించడం లేదు.

కడప కోటిరెడ్డిసర్కిల్/ఎర్రగుంట్ల : దేశంలో 2016లో పెద్ద నోట్ల రద్దు జరిగింది. అనంతరం ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులు అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించారు. కానీ అవి పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్తుందనే అపోహ, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి.

చిరు వ్యాపారుల చెంతకు....

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిల్‌పై వ్యాపారాలు చేసే వారంతా ఆన్‌లైన్ చెల్లింపులు ప్రోత్సహిస్తున్నారు. ఈ డిజిటల్ పేమెంట్‌తో ప్రధానంగా వ్యాపారులకు చిల్లర సమస్య ఉండడం లేదు. పేమెంట్ యాప్‌లకు సంబంధించి క్యూర్ కోడ్ లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా ఈ స్టిక్కర్ బోర్డులు కనిపిస్తాయి. పెద్దపెద్ద బంగారు నగల దుకాణాలు మొదలుకొని తోపుడు బండ్ల వరకు ఆన్‌లైన్ చెల్లింపులు నిర్వహించడం అన్ని విధాల ప్రయోజనకరంగా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో సైతం

నిన్న మొన్నటి వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా టిక్కెట్టుకు సరిపడా చెల్లించి బస్సు ఎక్కాల్సి వచ్చేది. అలాంటిది ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు ఆన్‌లైన్ పేమెంట్లపై దృష్టి సారించారు. దూర ప్రాంతాల సర్వీసులతో పాటు దాదాపు అన్ని సర్వీసుల్లోనూ ఆన్‌లైన్ పేమెంట్‌కు అవకాశం కల్పించారు. ప్రయాణికుడు ఎంత దూరం ప్రయాణించినా సమస్య ఎదురుకాకుండా స్కానర్ ద్వారా టిక్కెట్టు తీసుకునే అవకాశం కల్పించారు. ముఖ్యంగా ఆర్టీసీలో అందుబాటులోకి వచ్చిన ఈ సౌకర్యంతో చిల్లర సమస్యకు చెక్ పడిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆన్‌లైన్ వ్యాపారాలు ఎక్కువగా సాగించే సూపర్ మార్కెట్

బ్యాంకుల్లో సైతం

ప్రజలు వివిధ వస్తువులు, సరుకులు కొనుగోలుతో పాటు బ్యాంకుల్లో సైతం డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కారణంగా నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయి. మరికొంతమంది నగదు రహిత లావాదేవీలను ఇంటి వద్ద నుంచే పొందుతున్నారు. ఈ కారణంగా బ్యాంకును ఆశ్రయించే ఖాతాదారుల సంఖ్య తగ్గుతోందని వివిధ బ్యాంకుల అధికారులు తెలియజేస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అన్ని చోట్ల ఆన్‌లైన్ చెల్లింపులే..

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమోజాన్‌పే లాంటి పేమెంట్ యాప్ సేవలతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీల వరకు ఈ యాప్‌ల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి, బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్, ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి నుంచి అన్ని రకాల సేవలు పొందుతున్నారు.

మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపులకు ఉపయోగాలతోపాటు ఆదమరిస్తే మోసాలకు గురయ్యే అవకాశం ఉంది. వాటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందురు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. సరకు కొనుగోలు చేసిన తర్వాత వేరే వాటికి అమోంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ మెసెజ్‌ను చూపించి అక్కడ నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్‌లోకి వచ్చిన క్యూర్ కోడ్ స్పీకర్ బాక్సులు, ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణ యజమాని ఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్ వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

మద్యం దుకాణంలో హైడ్రామా?

- రూ.2 లక్షలు చోరీ జరిగినా ఫిర్యాదుచేయని ఎక్సైజ్ అధికారులు
- సిబ్బంది నుంచి డబ్బు రికవరీ చేయడంతో ఆందోళన



అధికారులతో మాట్లాడుతున్న సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : మద్యం దుకాణంలో హైడ్రామా నడిచింది. రూ.2 లక్షల నగదు, మద్యం సీసాలు చోరీకి గురికాగా... మద్యం మాత్రమే చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి.. .సిబ్బంది నుంచి రికవరీ చేసిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రొద్దుటూరు టూటౌన్ బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రూ.2 లక్షల నగదు చోరీ జరిగినట్లు సిబ్బంది తెలిపారు. సీఐ సుభాషిణి, అధికారులు మద్యం దుకాణాన్ని బుధవారం పరిశీలించారు. డబ్బు పోయిన విషయాన్ని స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని సిబ్బంది తెలుపగా, అధికారులు అంగీకరించలేదు. రూ.2లక్షలు రాత్రి సమయాల్లో దుకాణంలో పెట్టడం నిబంధనలకు విరుద్ధమని, అందుకు సిబ్బందే బాధ్యత వహించాల్సి వస్తుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అక్కడ పని చేస్తున్న నలుగురు సిబ్బందిచే రూ.2,37,000 నగదు అప్పటికప్పుడు కట్టించుకున్నారు. 17 మద్యం సీసాలు చోరీ అయినట్లు ఎక్సైజ్ సీఐ సుభాషిణి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సిబ్బంది ఆందోళనతో వెలుగులోకి

తమతో బలవంతంగా రూ.2,37,000 కట్టించుకున్నారని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు గురువారం ఎక్సైజ్ డిపో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగడంతో చోరీ విషయం వెలుగుచూసింది. రూ.2,37,000 చోరీ జరిగితే అధికారులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని వారు ఆరోపించారు. దుకాణంలో పని చేస్తున్న నలుగురు సిబ్బంది బంగారు నగలను తాకట్టు పెట్టి డబ్బు చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది డబ్బు కట్టిన విషయం తనకు తెలియదని డిపో మేనేజర్ తిమ్మనాయుడు తెలిపారు. కుటుంబ సభ్యుల ఆందోళన ఫలితంగా దిగివచ్చిన అధికారులు రూ. 2,37,000 నగదు చోరీ జరిగినట్లు గురువారం రాత్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాలుగు దుంగలు స్వాధీనం



అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న కారు

బద్వేలు అర్బన్ : బద్వేల్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని ఒత్తిమడుగు సెక్షన్ వద్ద రాణిబావి అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారు జామున నాలుగు ఎర్రచందనం దుంగలతోపాటు ఓ కారును అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. బద్వేల్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని రాణిబావి అటవీ ప్రాంత సమీపంలో అటవీ శాఖ సిబ్బంది తనిఖీలు చేశారు. అటవీ ప్రాంతంలో ఆపిన కారును పరిశీలించగా 4 ఎర్రచందనం దుంగలు లభించాయి. అక్కడ గాలింపు చేపట్టినా నిందితుల ఆచూకీ లభించలేదు. దీంతో కారును బద్వేల్‌లోని ఫారెస్టు గోదాముకు తరలించారు. రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా పట్టణంలోని అమ్మవారిశాలవీధికి చెందిన షఫికి చెందని కారు కావడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు బద్వేల్‌కు చేరుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

రైతులకు నైపుణ్య ఆధారిత శిక్షణ

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్. సాయిమహేశ్వరి

కడప అగ్రికల్చర్ : వానపాము ఎరువుల తయారీ, ఇతర అంశాలపై రైతులకు ఇస్తున్న నైపుణ్య ఆధారిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి సూచించారు. ఊటుకూరు కేవీకేలో గురవారం జరిగిన నైపుణ్య ఆధారిత శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన అనంతరం ఆచరణ పెడుతూ జీవనోపాధి పొందాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయన ఎరువు వాడితే భూ సమతుల్యత దెబ్బతిని ఉత్పాదకత తగ్గిపోతుందన్నారు. సేద్య విభాగ శాస్త్రవేత్త సాయి మహేశ్వరి మాట్లాడుతూ వర్షాధార పరిస్థితులతో ఆర్థిక సుస్థిరత సాధించడం కష్టతరం కాబట్టి వానపాముల తయారీని కుటీర పరిశ్రమగా ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ మానస, మమత, రైతులు పాల్గొన్నారు.

దాడులను సమష్టిగా అడ్డుకుందాం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : అధికార పార్టీ నాయకుల దాడులు, కక్ష సాధింపు చర్యలను సమష్టిగా అడ్డుకుందామని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ నాయకులకు పిలుపునిచ్చారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బద్వేల్ రూరల్, మున్సిపాలిటీ, గోపవరం, అట్లూరు, బి.కోడూరు మండలాల ముఖ్య నేతలతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఓడిపోయిందని ఎవరూ అధైర్య పడవద్దని, అధర్మం ఎంతో కాలం నిలవదని వారు అన్నారు. నియోజకవర్గంతోపాటు జిల్లాలో పార్టీ కేడర్ బలంగా ఉందని, కార్యకర్తలకు, నాయకులకు ఏ కష్టం వచ్చినా ముందుండి పోరాడతామని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కె.రమణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గోపాలస్వామి, సుందర్‌రామిరెడ్డి, అందూరురామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పుల్లయ్య, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

– భర్త, అత్తతో పాటు నలుగురు అరెస్ట్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నబీకోటలో ఓ యువతి(17).. తన భర్త మాధవ్, అత్త వెంకటసుబ్బమ్మల వేధింపులు తాళలేక ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నబీ కోటలో ఉంటున్న మాధవ్.. 14 ఏళ్ల యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది బాలుడు సంతానం. ఇటీవల భర్త మాధవ్, అత్త వెంకటసుబ్బమ్మతోపాటు, మరో ఇద్దరు యువతిని వేధించసాగారు. వేధింపులు తాళలేక యువతి ఈ నెల 23న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

జులై 1 నుంచి స్టాప్ డయేరియా క్యాంపెయిన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, అధికారులు

కడప రూరల్ : జిల్లాలో డయేరియా నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జులై 1 నుంచి 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో క్యాంపెయిన్ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వైద్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు డయేరియాపై అవగాహన కల్పించాలన్నారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏటీఓ డాక్టర్ రవిబాబు, ఎస్ఓ రమేష్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన అనూష (ఫైల్)

బి.కోడూరు : మండలంలోని రాజుపాలెం దళిత వాడకు చెందిన మున్నెల్లి అనూష(19) గురువారం ఉదయం ఇంట్లో ఫంకాకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పోరుమామిళ్లలోని ఓ ప్రైవేటు కళాశాలలో అనూష డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల వేసవి సెలవుల్లో వనిపెంటలోని పెద్దమ్మ ఇంటికి వెళ్ళింది. అక్కడ ఓ అబ్బాయితో పరిచయం పెంచుకోవడం గమనించిన బంధువులు అమ్మాయి తల్లిదండ్రులకు విషయం తెలిపారు. దీంతో అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులు బి.కోడూరు పోలీస్ స్టేషన్‌కు ఇద్దరినీ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అనూషను ఇంటికి తీసుకు వచ్చి తల్లిదండ్రులు కూడా మందలించారు. గురువారం ఉదయం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా.. అనూష ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. బి.కోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం అత్తామామలను కడతేర్చి..

వీరబల్లి : ఆస్తి తనకు ఇవ్వలేదనే కోపం.. వారి బాగోగులు చూడాలనే ఆవేదన వెరసి ఓ యువతి తన అత్తమామలను మట్టు పెట్టాలని పథకం వేసింది. ముష్టిచెక్కబెల్లం నూరి వారికి తాగించి చంపేసింది. పోలీసుల వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం కొత్తవడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణను అదే గ్రామానికి చెందిన కళావతి వివాహం చేసుకుంది. భర్త మద్యానికి బానిస కావడంతో అత్త, మామలు నాగసుబ్బన్న(80), నాగమ్మ70) బాగోగులు కళావతి చూడాల్సి వచ్చింది. ఆస్తిని తన పేరుతో రాయించుకుని వారిని మట్టుపెట్టాలని భావించింది. భర్త వెంకటరమణకు పూటుగా మద్యం తాగించింది. అతడు మత్తులో ఉన్న సమయంలో ముష్టిచెక్కబెల్లం నూరి తన అత్తామామలతో బలవంతంగా తాగించింది. విలవిలలాడుతున్న వారిని స్థానికులు గమనించి రాయచోటి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలంలోని మృతి చెందిన హరినాథ్

లింగాల : పులివెందుల–పార్నపల్లె ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో హరినాథ్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు..వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన తూర్పింటి హరినాథ్ చిన్నకుడాల నుంచి పులివెందులకు గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఇప్పట్ల బస్టాండు సమీపంలో మలుపు వద్ద వేగం అదుపు చేయలేక రోడ్డు ప్రక్కనే స్తంభాన్ని ఢీకొట్టి పొలంలోకి ఎగిరిపడ్డాడు. తలకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య గంగాదేవి, కుమారులు కార్తీక్, తేజ ఉన్నారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్

బి.కొత్తకోట : భార్యను చంపిన కేసులో నిందితుడైన భర్తను అరెస్టు చేసినట్టు సీఐ సూర్యనారాయణ తెలిపారు. కర్ణాటకలోని ఎగువకోటకు చెందిన మల్లికార్జునతో(32)తో 12 ఏళ్ల కిందట బి.కొత్తకోట మండలం పట్రవారిపల్లెకు చెందిన అన్నపూర్ణ(28)తో వివాహమైంది. వీరికి ఒకరు సంతానం. అనంతరం మల్లికార్జున మరో మహిళను వివాహం చేసుకోగా వారికి ముగ్గురు సంతానం. ఈ మధ్య కుటుంబంలో జరిగిన ఘటనలతో రెండో భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ కేసులో నిందితుడి మల్లికార్జునను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి వచ్చిన మల్లికార్జునను కలిసుందామని అన్నపూర్ణ కోరడంతో బేధాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఎట్రవారిపల్లెకు తీసుకొస్తూ మార్గమధ్యంలో జమాలమ్మ దర్గా వద్ద అన్నపూర్ణ గొంతు నులిమి హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చంపుతాడేమోనని.. చంపేశాడు

ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్



అరెస్ట్ వివరాలను మీడియాకు వివరిస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : తాను ఇష్టపడే మహిళను దూరం చేస్తాడనే భయంతో.. ద్వేషం పెంచుకున్న ఒకడు.. అతడి అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నాడు.. అదును చూసుకుని ప్రత్యర్థిని కిరాతకంగా చంపేశాడు.. డీఎస్పీ మురళీధర్ విలేకరులతో గురువారం వివరాలు వెల్లడించారు.

నాగరత్నమ్మకు 30 ఏళ్ల కిందట శ్రీనివాసులురెడ్డితో వివాహమైంది. వీరికి మహేశ్వరరెడ్డి(12) సంతానం. కొంత కాలానికి శ్రీనివాసులురెడ్డి మృతి చెందడంతో రామచంద్రారెడ్డి అనే మిఠాయి వ్యాపారితో 18 ఏళ్లుగా నాగరత్నమ్మ సహజీవనం చేస్తోంది. రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ, మహేశ్వరరెడ్డి కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొన్ని నెలల కిందట నాగరత్నమ్మ వద్ద రూ.3 లక్షలు రామచంద్రారెడ్డి అప్పు తీసుకున్నాడు. ఇటీవల మహేశ్వరరెడ్డి మద్యానికి బానిసై గొడవ పడేవాడు. దీంతో రామచంద్రారెడ్డి అతడిని సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ లేబర్‌గా చేర్పించాడు. ఇదిలా ఉంటే మృతుడు మహేశ్వరరెడ్డికి ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఈ విషయంపై నాగరత్నమ్మ, రామచంద్రారెడ్డి అతడిని మందలించారు. ఇదే సమయంలో రామచంద్రారెడ్డి ఆ యువతితో చనువుగా ఉన్నాడనే విషయం తెలుసుకున్న మహేశ్వరరెడ్డి తరచూ ఆగ్రహం వ్యక్తం చేసేవాడు. ఈ నేపథ్యంలో తన తల్లి వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేయాలని.. తాము కలిసి ఎక్కడికైనా వెళ్లి బతుకుతామని చెప్పాడు. దీంతో నాగరత్నమ్మ తన నుంచి దూరం అవుతుందని భావించిన రామచంద్రారెడ్డి డబ్బు ఇవ్వకుండా మాట దాటేస్తూ వచ్చాడు. తన తల్లిని దూరం చేసేందుకు ఇలా చేస్తున్నావంటూ తరచూ గొడవపడుతుండడంతో మహేశ్వరరెడ్డి తనను ఎక్కడ చంపేస్తాడోనని.. రామచంద్రారెడ్డి భయపడ్డాడు. ఈ నెల 25న నిద్రపోతున్న అతడిని రామచంద్రారెడ్డి హతమార్చాడు. మృతదేహాన్ని బయటికి తీసుకెళ్లడం సాధ్యం కాదని మూడు ముక్కలుగా నరికాడు. తర్వాత రెండు ప్లాస్టిక్ సంచుల్లో వేసుకొని బైక్‌లో తీసుకెళ్లి శివారు ప్రాంతంలో పడేశాడు. అనంతరం చాపాడు మండంలోని కొండపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకున్నాడు.

తల్లి ఫిర్యాదుతో కేసు ఛేదించారు

వైఎంఆర్ కాలనీలోని తన ఇంట్లో కుమారుడు కనిపించడం లేదని 24న ఉదయం నాగరత్నమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రారెడ్డి అనే వ్యక్తిపై ఆమె అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు విచారణ మొదలుపెట్టారు. రక్తపు మరకలు ఉండడం.. సంఘటనా స్థలంలో మృతదేహం కనిపించకపోవడం పోలీసులను ఆందోళనకు గురిచేసింది. సీసీ ఫుటేజీ, డాగ్ స్క్వాడ్, ఇతర టెక్నాలజీ ఆధారంగా మహేశ్వరరెడ్డి మృతదేహం రాయల్ కౌంటీకి వెళ్లే దారిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ ముళ్ల పొదల్లోని ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న మహేశ్వరరెడ్డి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి పంపి పోస్టుమార్టం చేయించారు. ఇది తెలుసుకున్న తల్లి నాగరత్నమ్మ ×నా కుమారుడ్ని ఎందుకు అంత క్రూరంగా చంపాల్సి వచ్చింది.. చంపాల్సినంత తప్పు మా వాడు ఏం చేశాడు౯ అంటూ రోదించింది. రామచంద్రారెడ్డిపై అనుమానంతో విచారించిన పోలీసులు లొకేషన్ ఆధారంగా అతడు ఉన్న చోటు గుర్తించి గురువారం అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన రాడ్డు, గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు రామచంద్రారెడ్డిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన త్రీటౌన్ సీఐ వెంకటరమణ, టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం, రూరల్ సీఐ రమణారెడ్డి, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ పోలీసు బృందాలను డీఎస్పీ అభినందించారు. ఎస్పీ ద్వారా ప్రత్యేక రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.